
# దానిమ్మచెట్టు

యస్. వివేకానంద



రైలు దిగి బైటకొచ్చిన రంగనాథాన్ని రిక్షా వాళ్లంతా చుట్టూ ముట్టేరు.

జేబులో ఉత్తరం బైటికి తీసి ఎడ్రసు మరోమారు చూసుకుని రిక్షావాళ్ల బాధ భరించలేక అర్ధరూపాయికి బేరమాడి రిక్షా యెక్కేడు.

కథ చెప్పబోయే ముందు రంగనాథం గురించి కొంచెం సంగ్రహంగ చెప్పటం భావ్యం.

బి. ఏ. అయ్యాక వైజాగ్‌లో ఉద్యోగానికి కుదిరేడు. అందంగ ఆడపిల్లలా వుండకపోయినా అనాకారి మాత్రం కాడు.

చెయ్యి తిరిగిన జూనియర్ రచయిత రంగనాథం. అతని కథలు అడపా దడపా పత్రికల్లో అచ్చు అవుతుంటాయి.

పై కారణంగా పాఠకుల్లో కొందరు స్నేహితులయ్యారు.

అందరిలోకీ సన్నిహితురాలు శారద.

తరచు ఆమె వ్రాసే ఉత్తరాలను బట్టి తన రచనలకు ఆమె యెంతో విలువ నిస్తున్నట్టు తద్వారా ఆమె హృదయంలో ప్రత్యేక స్థానం ఇచ్చినట్టు అర్థం చేసుకున్నాడు.

ఘనాపాటీ రచయిత రంగనాథం శారదను స్వయంగా కల్సుకోవాలని అభిప్రాయపడి గుంటూరొచ్చాడు.

రిక్షా అరండల్‌పేట ఆరోలైన్‌లో ఆగింది.

'ఎన్నో' అడ్డరోడ్డుకు పోవాలి సార్....' రిక్షావాడి ప్రశ్న.

సమాధానం కోసం జేబులో వుంచిన కవరు బైటికి తీసి నిబంధనావళి వెతక సాగేడు.

మడిచిన ఉత్తరాన్ని జేబులో పెడుతూ అయోమయావస్థలో పడ్డ రంగనాథం 'ఎన్ని అడ్డరోడ్లున్నయి' రిక్షావాడి నడిగేడు.

'పదిహేనున్నయి సార్!'

మతి పోయింది రంగనాథానికి.

పెద్ద చిక్కే వచ్చిందనుకుని రిక్షా దిగి బండివాడికి డబ్బులిచ్చి పంపేడు.

రమ్మని వ్రాసిన శారద వివరంగా ఇంటి అడ్రసు వ్రాయలేదేం చెప్మా అనుకుంటూ నడుస్తున్నాడు.

వీధి రెండు వైపులా తీర్చి దిద్దినట్టున్న ఇళ్లను చూస్తూ పదిహేను అడ్డరోడ్లను దాటాడు.

సందు మొదటి నుండి చివరి వరకూ యెన్నిసార్లు పరకాయించినా శారద ఇల్లు ఆచూకీ దొరకలేదు.

రోడ్డు మొదటి కొచ్చి చెమట ముఖాన్ని తుడుచుకుని యెదురుగా వున్న కోమల విలాస్‌లోకి జొరబడి కాఫీకి ఆర్డరిచ్చాడు.

కాఫీ వచ్చేలోగా శారద లేటెస్టుగ వ్రాసిన జాబును మరోమారు చదివాడు. ఆమె ఇంటిముందు దానిమ్మచెట్టు వున్నదనే విషయం ఉత్తరంలో చూసేక హమ్మయ్య అనుకుని గట్టిగ శ్వాస పీల్చుకున్నాడు.

సిగరెట్ వెలిగించి మళ్ళీ గృహాన్వేషణలో లీనమయ్యాడు.

మళ్ళీ పదిహేను అడ్డరోడ్లూ దాటి చివరి కళ్లా వెళ్లి నిల్చున్నాడు.

పెద్ద చిక్కే వచ్చిందనుకున్నాడు.

ఖర్మ! ప్రతి ఇంటి ముందు ఓ దానిమ్మ చెట్టుంది.

ఉదయం ఎనిమిదింటికి రైలు దిగిన రంగనాథం పదిగంటలు కావస్తున్నా ఇంకా ఇల్లు వెతుకుతూనే వున్నాడు.

ఇహ లాభంలేదనుకుని లాటరీ వేసుకుని ఇంటి ముందు కెళ్లి నిల్చున్నారు.

ఓ అరెకర దాబా—చుట్టూ ప్రహరీ గోడ పెద్ద ఇనుపగేటు వాకిలి. లోపలగా దానిమ్మ

చెట్లు, రెండు కొబ్బరిచెట్లు మరి నాలుగైదు పూలచెట్లు వున్నాయి.

శారద వుత్తరాల్లో వ్రాసే ఇంటి వాతావరణాన్ని పోల్చి చూచుకుని ధైర్యంగా గేటు తోసుకుని లోపలి కెళ్లాడు.

కుక్క వున్నది జాగ్రత్త అనే బోర్డు వున్నదన్న మాటేగాని రంగనాధాన్ని చూసే సరికి కుక్క తల తిప్పుతు తోకాడిస్తూ లోని కాహ్వానించింది.

సెభాష్ అనుకుని బిడియపడుతూనే పంచలో నిల్చున్నాడు.

జనసంచారమేమీ కన్పించలేదు.

ఎన్నిసార్లు పిల్చినా యెవ్వరూ పలక్కపోయే సరికి పంచలో వున్న ఓ కుర్చీలో చతికిలబడ్డాడు.

సేద తీర్చుకుంటున్న రంగనాధానికి ఎదురుగ గోడకు వ్రేలాడుతున్న ఫోటోలు కన్పించాయి.

కూర్చున్న వాడల్లా లేచి ఓ ఫామిలీ ఫోటో దగ్గిర కెళ్లి పరీక్షగ చూస్తూ వుండిపోయాడు.

'ఏయ్ ఎవరు నువ్వు...' అనే ఖకర కంఠ ధ్వనికి తుళ్లిపడ్డ రంగనాధం వెనక్కు తిరిగాడు.

బలిష్టమైన నలభైయ్యేళ్ల కాయం కన్పించింది.

'ఎవరు కావాలి నీకు' మళ్లీ ప్రశ్న.

ఏకవచన ప్రయోగం చేయటంతో అంతరాంతరంలో ఫీలవుతూ 'మీరెవరు?' అడిగేడు.

'అయ్యగారి నౌకర్ని.'

'అంతేగదా! అయితే ఫర్వాలేదు. అయ్యగారి అయ్యవారిలాగ కేకలు పెడుతుంటే యెవరో అనుకున్నాను.'

'ఇంతకూ మీ కెవరు కావాలి?'

అమ్మగారు అనబోయి నాలిక్కరుచుకుని 'అమ్మాయి గారు కావాలి' అన్నాడు.

'ఏం? యేళాకోళంగా వుందా?!—'

'అది గాదయ్యా!.. ఇలారా!' అనేసి దగ్గరగా పిల్చి ఫ్యామిలీ ఫోటో ప్రక్కనే వున్న మరో సింగిల్ సైజు ఫోటోలో అమ్మాయిని చూపిస్తూ 'ఈ అమ్మాయి నీకు తెలుసా? అడిగేడు.

'తెల్సు'

'అయితే ఇంకేం. ఆమే కావాలి. ఆమె కోసమే వచ్చాను.'

'మీకేమైనా మతిబోయిందా?'—

'చూడు. పిచ్చిగా వాక్కు. వెళ్లు. వెళ్లి నే వచ్చానని మీ అమ్మాయిగారికి చెప్పు.'

'మీకు నిజంగా పిచ్చే. కాకపోతే ఏందండి ఆ ఫోటోలో అమ్మాయిగారు సచ్చిపోయి సంవత్సరం దాటింది. సరే కూర్చోండి. డాక్టరయ్య వచ్చాక ఆయనతోనే మాట్లాడుదురు.' అనేసి లోపలి కెళ్లాడు.

'చచ్చిపోయిందా...' అని మనసులో మరోమారు అనుకుని అయితే ఫోటోలో అమ్మాయి శారద అక్కగారే అయి వుంటుందని ఊహించేడు.

ఇంతలో వాకిలి గేటు తోసుకుని ఓ యాభైయేళ్ల వ్యక్తి లోపలికి రావటం చూచి శారద తండ్రి ఐ వుండవచ్చునని కూర్చున్నవాడల్లా లేచి నిల్చుని 'నమస్కారమండీ!' అన్నాడు.

ప్రతినమస్కారంగా కళ్ల జోడులోంచి ఓరగ రంగనాధం కేసి ఎవరన్నట్టు ప్రశ్నార్థకంగా చూసేడు.

'నా పేరు రంగనాధం. విశాఖపట్నంనుండి వచ్చాను.'

'అలాగా! పాపం. చాలాదూరం నుండి వచ్చావ్. కూర్చో!'

'అవునండీ.'

'ఎంత సేపైంది వచ్చి...'

'ఇంతకు ముందేనండి. ఇల్లు వెతకటంలో కొంచెం కష్టమన్పించినా చివరికి కనుక్కోగలిగేను.'

'చాలా సంతోషం.'

'నేను మళ్లీ తిరిగి రాత్రి రైలుకే వెళ్లిపోవాలి...'

'అంత తొందరైతే యెట్లా?!—'

'వెళ్లాలండి. తప్పదు.'

'చూడు రంగనాధం. ప్రేమ విషయాన్ని పదిక్షణాల్లో తేల్చాలంటే కష్టం. నే లోపలి కెళ్లొస్తాను.' అనేసి ఇంట్లో కెళ్లారు.

ఓ పావుగంట మాటలు చెప్పుకున్నారు. ఒకరు చెప్పేది మరొకరికి అర్థం కావడం లేదు.

'అవునయ్యా! ప్రేమ విషయం అంత తేలికగాదు. పైగా ఆ లక్షణాలన్నీ నీలో వున్నయ్. అసలు నా హస్తవాసి నీకు తెలిస్తే ఇంత తొందరపడవ్.'

'మీరంటున్నది....' ఆయనగారి ధోరణి ద్దంగాక విస్తుపోయాడు రంగనాధం.

ఎంత సేపటికీ ప్రేమ విషయమంటూ గాని శారద విషయం హెచ్చరించడేవాడే రంగనాధం ప్రశ్న.

'విషయం మీకు అర్థమైందనుకుటాను...'

'తెల్సునయ్యా. తర్వాత నాకు మా రాకూడదు. చూడు.. ప్రేమ పిచ్చి తగ్గాలంటే తొందరపడి లాభంలేదు. కష్టమై అంతదూరం నుండి కావాలని వచ్చేక పిచ్చి నయం గాకుండ వెళ్తానంటే యెట్లా? నువ్వు వెడతానన్నా పోనివ్వను.'

'చంపేశారు. నాకు పిచ్చేమిటి??'

'నా దగ్గరకొచ్చే వారంతా ఇలాగే అంటారు.'

'ఇంకా నయం. విషయం తొందరగానే చెప్పేరు. తమరు పిచ్చిడాక్టర్లా. క్షమించాలి. నేను పొరపాటు పడ్డాను. వస్తానండి!' అనేసి కూర్చున్నవాడల్లా లేవబోయాడు.

బలవంతంగా కూర్చో బెడుతూ వెళ్లేందుకు వీల్లేదని నిర్బంధించాడు.

'డాక్టరుగారూ. మీకో నమస్కారం. నాకు పిచ్చిలేదు. అసలు నే వచ్చిన పనివేరు. నా దారిన నన్ను పోనివ్వండి.'

'అదేం కుదరదు. నువ్వెక్కువగా మాట్లాడి ప్రయోజన ముండదు.'

'ఇదేం ఖర్మరా బాబూ! నేరకపోయి పిచ్చాసుపత్రి కొచ్చాను.' అంటూ వాపోయాడు.

డాక్టరు కేవిధంగా తన పరిస్థితి తెలిచెప్పి నమ్మించాలో అర్థంగాక సతమతమవుతున్నాడు.

'చూడబ్బాయి. ఎట్లాగూ వచ్చావ్ పని పూర్తికానిదే మాత్రం వెళ్లాలని ప్రయత్నిస్తే మాత్రం జాగ్రత్త!'హంటరుతో బెదిరించి నౌకరును రంగనాధానికి కావలా వుంచి బైటికెళ్లిపోయాడు.

కుడితిలో పడ్డ యెలుక సామెతైంది రంగనాధం పరిస్థితి. తప్పించుకు పారిపోదామంటే యముడిలాంటి నౌకరు కావలా వున్నాడు. వాడు కనుక చెయ్యి చేసుకుంటే వళ్లు హూనమవుతుంది.

ఏం చేయటానికి తోచకుండా వుంది.

నౌకరు తనకేసి చూడ్డం గమనిస్తూనే వున్నాడు. మంచితనంగా వాడిని లొంగదీసుకుని కాకా పట్టయినా తప్పించుకోవాలనే నిర్ణయాని కొచ్చాడు.

ఓ చిన్న పకిలింపు ధ్వనిచేసి 'ఇంతకూ పేరేమిటన్నావు?' అడిగేడు.

'యెంకాయండి.'

'శేష్. ఇనుము లాంటి మనిషివి. మరి.. నువ్వు నే సిగరెట్ వెలిగించుకోవా...?'

'అయ్యగారొచ్చే తోగా రాదెయ్యండి.' అనేసి రంగనాథం కాళ్ళ దగ్గర చతికిల బడ్డాడు.

సిగరెట్ పొగను రింగులు రింగులుగా వదలడం చూసిన యెంకాయి కళ్ళు

## దానిమ్మచెట్టు

పెద్దవి చేసి నోరు చప్పరించటం గమనించిన రంగనాథం 'మరొక్కటి కాల్చు' మరోటి అందించేడు.

'నాకెందుకు బాబూ బీడీలు తాగేవాడ్ని' నసుగుతూనే అందుకున్నాడు.

'అదిసరే... అయ్యగారు నీకే మాత్రం జీతమిస్తారు?'

'యెంతండీ నా మొకం. కూడుబెట్టి నెలకో ఇరవై ఇస్తారు.'

'ముష్టి ఇరవై రూపాయలకి ఇంత వెట్టిచాకిరీ యెలా చేస్తున్నావోయ్.'

'ఏం చేస్తానయ్యా. అంతకంటే గతి లేదు.'

రంగనాథం బుర్రలో ఆలోచన మెరుపులా మెరిసింది. జేబులోకి చెయ్యి పోనిచ్చి ఐదు రూపాయల నోటు తీసి యెటో చూస్తున్న యెంకాయి కాళ్ళ ముందు పడేశాడు.

ఓ క్షణం గడిచేక యేదో పోయినవాడిలా చుట్టూ వెతకటం ప్రారంభించేడు.

'ఏందయ్యా వెతుకుతున్నారు?'

'ఐదు రూపాయల నోటు అగుపించటం లేదోయ్...'

కాళ్ళముందు పడి వున్న నోటు తీసి చేతికిస్తూ 'ఇదిగో నండీ ఇక్కడే పడ్డది' అన్నాడు.

'ఉన్నదయ్యా.. నీ దగ్గర కెట్లా వచ్చిందోయ్.. పోన్లే పాపం.. అసలే డబ్బు లేదంటున్నావా... నీ నిజాయితీకి బహుమానంగా నువ్వే తీసుకో....'

యెంకాయి ముఖం ఆనందంతో విప్పారింది. నోటు వద్దు వద్దంటూనే తీసుకుని బొడ్లో దోపేడు.

ఓ మారు వళ్ళు విరుచుకొని 'నువ్వు నాకో సాయం చేసి పెడతావ్?'

'చెప్పండయ్యా. చిటికెలో చేసి పెడతాను.' కూర్చున్నవాడల్లా లేచి నిల్చున్నాడు.

'ఏంలేదు. ఆకలి దంచేస్తోందోయ్.. పొద్దునగా వట్టి కాఫీ తాగేను. అట్లా బజారెళ్ళి టిఫినేదైనా పట్రా.. వస్తూ.. నువ్వు పొగాకు తెచ్చుకో—అనేసి మరో ఐదు రూపాయల నోటందించేడు.

'మీరిడే వుండండి. నేనిప్పుడే చిటికెలో వస్తా' రోడ్డు మీదికెళ్ళేడు యెంకాయి—

బ్రతుకు జీవుడా అనుకున్న రంగనాథం యెంకాయి గేటు దాటడం చూసి తనూ వెనకనుంచే రోడ్డు మీదికొచ్చి రిక్షా మాట్లాడేడు స్టేషనుకు.

రిక్షా బయల్దేరింది.

ఓమారు వెనక్కి తిరిగి చూసేడు.

వీధి కిరువైపులా ఇళ్ళల్లో వున్న దానిమ్మచెట్లు రంగనాథంకేసి వెక్కిరిస్తున్నట్లు చూశాయి. ●

## వెన్నెల పువ్వులు

చీకట్ల పొదలలో చిన్నివెన్నెల పువ్వు
లెన్నిపోవులు కోసి యెవరు పోశారో!

గగనసుందరి కబరికాభరము నిండుగా
ఇన్నిపువ్వులు దూసి యెవరు ముడిచారో!

వెల్లకల్వలనడుమ తెల్ల పూవు లమర్చి
ఇంత నేర్పుగ నెవరు ఎవ్వరల్లారో!

ఇన్ని పువ్వులనడుమ ఈ పెద్ద పూవేమో!
ఇంత చక్కని పూవు నెవరు తెచ్చారో!

పొద్దుతిరుగుడు పువ్వు! ముద్దబంతియొ! వింత
అందాలు చిందించు అది యేమిపువ్వో!

ఆ పూవు తేనెకై ఆశించి ఆ నడుమ
నిండు తుమ్మెద లెన్ని క్రమ్ముకొన్నాయో!

అంతదూరమ్ములో ఆ పూవు వికసించ
వింత తీయని వలపు తెరదనిండాయో!

ఆ పూవు నా కాకే కల్పింతునా—రేయి
కిలకిలా చెలివోము కలకలాయనదా?

కలువపువ్వుల ఇల్లు కానుకగ ఏదా?
విలువునా నా యెడద పులకించిపోదా?

తరుణి నన్కరగించి తను కరగిపోదా?
మనసు లే అమరసీమకా తేలిపోదా?

—వక్కలంక లక్ష్మీపతిరావు